www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025

వైఎస్ఆర్

జర్నలిజం, లలిత కళల కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 21 నుంచి 31 వరకు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల పంచాలకులు డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ పబ్లిక్ రిలేషన్ (పిజిడిపిఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ తెలుగు జర్నలిజం (పిజిడిటిజె), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తర్ణీత సాధించినవారు అర్హులని తెలిపారు. కౌన్సిలింగ్‌కు అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో నేరుగా విశ్వవిద్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు యోగి వేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www yvu.edu.in ను సందర్శించాలని పేర్కొన్నారు.

ఇరిగేషన్‌లో పనుల జాతర

- రూ.4వేల కోట్లతో ఏడు పనులకు గ్రీన్‌సిగ్నల్
- రెండు చొప్పున లిఫ్టు, అక్విడెక్ట్ సహా టిజిపి భవన, ప్రహరీ పనులు

బ్రహ్మసాగర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఏడు రకాల పెండింగ్ ప్రాజెక్టు పనులకు ఆమోదం లభించింది. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం శుక్రవారం జిఒ ఎంస్ 44 ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని 71 పెండింగ్, 25 శాతం లోపు పనులకు ఆమోదం తెలిపింది. ఇందులో జిల్లాకు సంబంధించి ప్రధానమైన పనుల్లో రూ.3,556.76 కోట్లతో గండికోట జికెఎల్ఐ ఎత్తిపోతల పనులు, రూ.564.60 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతలు ఉన్నాయి. మిగిలిన పనుల్లో రూ.5.63 కోట్లతో పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో సింహాద్రిపురం మండల పరిధిలోని గురజాల గ్రామ సమీపంలో అక్విడెక్ట్, రూ.2. 63 కోట్లతో జికెఎల్ఐ స్కీములో భాగంగా భద్రంపల్లి మేజర్ మేజర్ కెనాల్ చెరువుల నిర్మాణం, రూ.96 లక్షలతో వేముల మండల పరిధిలోని ఉలిమెల సమీపంలోని పులివెందుల బ్రాంచ్ కెనా ల్‌లో అక్విడక్ట్ నిర్మాణం, రూ.1.79 కోట్లతో టిజిపి బద్వేల్ విభాగంలో భవన, కాంపౌండ్ నిర్మాణం, రూ.1.46 కోట్లతో కడప తెలుగుగంగ కాలనీ ప్రహరీ నిర్మాణ పనులకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిన వెంటనే పెండింగ్ పనులను వేగవంతం చేయనున్నట్లు ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొనడం గమనార్హం.

హామీలు కొండంత.. చేసింది గోరంత : యుటిఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొండంత అని, చేసింది గోరంత మాత్రమేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు విమర్శించారు. ఆదివారం కడపలోని యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో కూటమి పెద్దలు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ఉద్యోగుల పక్షపాతిగా వ్యవహరిస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించారన్నారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను నామమాత్రంగానే చెల్లించారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. గత పిఆర్‌సి బకాయిలతో పాటు డిఎ, సరెండర్ లీవ్, ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. 2024, జూన్‌కు 12వ పిఆర్‌సి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియమించిన పిఆర్‌సి చైర్మన్ డాక్టర్ మన్మోహన్ సింగ్ చైర్మన్ బాధ్యతలకు రాజీనామా చేసి ఏడాది కావస్తున్నా నూతన చైర్మన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన నాలుగు డిఎలను సైతం చెల్లించకపోవడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక్క రూపాయి కూడా వేతనంలో పెరుగుదల లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ వేతనాలు పెరుగుతాయని, తమ జీవితాలు మెరుగవుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని పదేపదే గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు సూపర్ సిక్స్ లోకి వస్తారో, రారో సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ పథకాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగులను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. ఉద్యోగులకు నెలసరి జీతాలను చెల్లించడమే ప్రభుత్వం గొప్పగా భావిస్తున్నట్లుందన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వానికి గడువు ఇవ్వాలనే ఉద్దేశంతో ఇంతకాలం సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేపట్టకుండా వేచి చూశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి, నాయకులు డి.సుబ్బారావు, సూర్య కుమార్, హిఫాజతుల్లా, శేషగిరిరావు పాల్గొన్నారు.

'అధికారులు న్యాయం చేయాలి'

ప్రజాశక్తి - కడప అర్బన్ : కొందరు తన స్థలంలో ఉన్న రేకులు దౌర్జన్యంగా తొలగించారని, అధికారులే న్యాయం చేయాలని నగర శివారులోని ఇందిరానగర్‌కు చెందిన ఒంటరి మహిళ రఫీజాన్ వేడుకుంటున్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఇందిరానగర్‌లో సర్వేనంబర్ 715లో 112 ప్లాట్ నంబర్‌లో తాము పదేళ్లుగా పొజిషన్‌లో ఉన్నామని, ఇప్పుడు వేరేవారు వచ్చి ఆ స్థలం తమదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2010లో తమ తల్లి ఖాతూన్ బీ పేరుతో రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని, ఆ స్థలంలో తాము బేస్‌మట్టం వేసుకొని రేకుల షెడ్డు, కట్టెలు ఏర్పాటు చేసుకుని ఉన్నామన్నారు. 2018లో ఖాతూన్ బీ మరణించడంతో ఆమె కుమార్తెగా తాను ఆ స్థలాన్ని కాచిపెట్టుకొని ఉన్నానన్నారు. కాగా ఇటీవల రైల్వేకోడూరుకు చెందిన రాజు అనే వ్యక్తి పోలీస్‌కానిస్టేబుల్ అని చెబుతూ ఆ స్థలం తన భార్య రుద్రరాజు లక్ష్మిదేవి పేరున ఉందని మరొక పొజిషన్ సర్టిఫికెట్ తీసుకొచ్చారన్నారు. దీనిపై పోలీసులను ఆశ్రయించగా వారు రిపోర్టు కోసం రెవెన్యూ వారికి రాశారన్నారు. ఆ నివేధిక ఏదీ తమకు ఇవ్వకుండానే తమ స్థలంలోకి వచ్చి దౌర్జన్యంగా రేకుల షెడ్ తొలగించడం అన్యాయమన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఎన్నో ఏళ్లుగా పొజిషన్‌లో ఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేష్మ పాల్గొన్నారు.

ఆడికృత్తిక ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కందుల విద్యా సంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మహావీర్ సర్కిల్ వద్ద ఉన్న సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆలయ అర్చకులు సందీప్ శర్మ తెలిపారు. ఉదయం 5 గంటలకు గుడికి చేరుకుని ప్రత్యేకంగా ఆషాఢ బహుళ దశమి ఆడికృత్తిక ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ప్రతిష్టించిన 18 అడుగుల సుబ్రమణ్య స్వామి విగ్రహానికి 108 లీటర్ల ఆవు పాలతో కుంబాభిషేకం నిర్వహించారని చెప్పారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి -కడప అర్బన్ : కడప శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. విద్యుత్ కాంతుల మధ్య సాంస్కృతిక కళా వేదిక పైన సుజాత వారి సహకారంతో ముద్ర డాన్స్ బృందం వారు అచ్చ తెలుగుతనం వుట్టి పడేలా డాన్స్ చేశారు. విజయశాంతి సారథ్యంలో శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అలరించాయి. పాటలు: గోదారి గట్టుమీద రామచిలకవే , రాను రాను బొంబాయికి, హిందీ పాటలకు నృత్యం చేశారు. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

పిల్లల్లో ఎదుగుదల లోపాలపై నిర్లక్ష్యం వద్దు

- ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ సోమశేఖర్

ప్రజాశక్తి-కడప సిటీ

పిల్లల ఎదుగుదల లోపాలను ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని వీటి పై నిర్లక్ష్యం తగదని ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. కడప పట్టణంలోని ఐఎంఎ హాల్లో 'ఆర్టిజం స్పెక్ట్రం డిసార్డర్'అనే అంశంపై అష్యూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, అనంతరం ఆటిజం పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్లోనే ఎదుగుదల లోపాలపై నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. 18 నెలలు నిండిన వెంటనే ప్రవర్తన ఎదుగుదల మాటలు వంటి వాటిని పరిశీలించాలని చెప్పారు. ఏమాత్రం తేడా ఉన్న వైద్యులను సంప్రదించాలని సూచించారు. వీలైనంత త్వరగా లోపాలను గుర్తించి సరైన థెరిపిస్తులతో చికిత్స తీసుకుంటే పిల్లలు సాధారణ జీవితం గడపచ్చని పేర్కొన్నారు. ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ అర్జున్ మాట్లాడుతూ పిల్లల్లో ఆటిజం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కడప రిమ్స్ పీడియాట్రిక్ హెచ్ఒడి డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ వీలైనంత వరకు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిజంకి ఎలాంటి చికిత్స లేదని తెరపిస్టులతో చికిత్స చేసుకుంటే సత్ఫలితాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు 500 మంది ఎదుగుదల లోపం ఉన్న పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గంగరాజు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్స్ యూనియన్ (బిటియు) జిల్లా అధ్యక్షులు మేంద్ర గుత్తి గంగరాజు కోరారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు పూర్తి చేసుకుందని తెలిపారు. ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సి కమిటీ వేయకపోవడం, కనీసం ఐఆర్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికలలో తాము అధికారంలోకి రాగానే వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని, మెరుగైన పిఆర్‌సి ఇస్తామని, పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆర్థిక విషయాలు అన్నీ పరిష్కరింపబడతాయని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికలలో చెప్పిన మాటలను ఉద్యోగ, ఉపాధ్యాయులు విశ్వసించి ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. మాతృభాషలో విద్యాబోధన విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దారితీస్తుందని తెలిపారు. మాతృభాషలో విద్యాబోధన ముఖ్యమని, చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.సుదర్శన్ బాబు, ట్రెజరర్ ఎ.రాజబాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కట్టా గంగాధర్ పాల్గొన్నారు.

వడ్డీ రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వడ్డీ రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని న్యూఢిల్లీ ఇస్లామిక్ ఫైనాన్స్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రాఖీబ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బిల్టప్ దగ్గర ఉన్న అజ్మత్ కల్యాణ మండపంలో అమానత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ అండ్ థ్రఫ్ట్ సొసైటీ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డీ రహిత సమాజాన్ని తీర్చిదిద్దినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అమానత్ సొసైటీ సంస్థ వడ్డీ లేకుండా పేదలకు రుణాలు ఇచ్చి వారు ఆర్థికంగా ఎదిగి సమాజానికి తోడ్పడాలన్నారు. ఇప్పటివరకు అమానత్ సంస్థ తరపున ఎంతో మందికి రుణాలు ఇచ్చి పేదలు స్వయం ఉపాధితో ఎదిగేలా కృషి చేయడం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో కూడా పేదలకు అండగా నిలిచేలా మరిన్ని సేవలు అందించి పేద ప్రజలకు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు వి ఎస్ అమీర్ బాబు, ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్, కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్, అమానత్ కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ ఇషాక్ అలీ, అమానుత్ సొసైటీ సభ్యులు, కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, పలువురు ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ రాఖీబ్

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- 8వ రోజుకు చేరుకున్న సమ్మె
- ఒంటి కాలిపై నిల్చుని నిరసన

ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 వేతనాలు ఇవ్వాలని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కార్మికుల సమ్మె 8వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటి కాలు పై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 2 నెలలుగా అనేక రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేస్తుంది తప్ప కార్మికులకు న్యాయం చేసింది ఏమీ లేదని చెప్పారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, గతంలో ఉన్న జీవో 36 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేయాలని పోరాటం చేస్తుంటే అధికారులు కార్మికులను బెదిరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అడిషనల్ వర్కర్స్, సెక్రెటరీతో పని చేసుకుంటూ నీళ్ల సమయానికి రాకుంటే కార్మికులపై నిందలు వేస్తున్న అధికారులు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. 25 సంవత్సరాల నుంచి ఇదే సంస్థలో మున్సిపల్ ఇంజినీర్ కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న కొంతమంది బినామీ కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చి కార్మికులచే పనులు చేయించుకుంటూ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. సమ్మె అనంతరం ఆ కార్మిక ద్రోహులకు కార్మికుల ద్వారా సరైన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలన్నారు. కేవలం రూ.13,807 ఇంజినీరింగ్ కార్మికుడు బతుకుతున్నాడని తెలిపారు. వారికి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వము విఫలమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.25వేల వేతనం ఉన్న చిన్న స్థాయి ఆప్కాస్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. డిమాండ్లు పరిష్కరించని పక్షంలో సోమవారం నుంచి సమ్మె ఉధృతం చేస్తామనిహెచ్చరించారు. నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్.గోపి, సహాయ కార్యదర్శులు ఆనందరావు, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర రవి, వై.ఎం.కేశవులు, కార్మికులు రామ్మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, గురవయ్య, ఆంజనేయులు, చాపయ్య, హరి, సన్నిధానము బుజ్జిబాబు, బద్రి, వెంకటశివ, ఆనందు, వెంకటేష్, అజముద్దీన్ బాష, గోపాల్, నరసింహ, ఎల్లయ్య, చిన్న రాయుడు, జయరాము, చలమయ్య, నాగరాజు, కొండమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : కొంతకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆదివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులు వారి విధులకు గైర్హాజరై ఇంజినీరింగ్ కార్మికలకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు. సిఐటియు పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ఆదివారానికి 8వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు విజయకుమార్ మాట్లాడుతూ న్యాయమైన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఆప్కాస్ ద్వారా విరమణ పొందిన, మృతి చెందిన, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్, పట్టణ కోశాధికారి రాఘవ కార్మికులు పాల్గొన్నారు

ప్రమాణం చేస్తున్న నూనత కార్యవర్గం

ఎల్ఐసిలో సొమ్ము భద్రం

-లియాఫీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి
- కడప బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసిలో పాలసీదారులు పెట్టిన సొమ్ము భద్రంగా ఉంటుందని, వారికి మంచి సేవలు అందుతాయని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసచారి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఫంక్షన్ హాల్‌లో లియాఫీ 15వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజీవన్ శ్రీ పాలసీ 9.5 శాతం వడ్డీతో ప్రజలకు అందుబాటులో ఉందని చెప్పారు. దేశంలో ఇంత పెద్ద మొత్తంలో వడ్డీ ఇచ్చే సంస్థలు, బ్యాంకులు ఏవి లేవని తెలిపారు. ఈ పాలసీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఏజెంట్లకు పిలుపునిచ్చారు. ఏజెంట్ సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏజెంటు, వారి కుటుంబానికి గ్రూప్ ఇన్సూరెన్స్ వయస్సు 69 సంవత్సరాల నుంచి 85 సంవత్సరాల పెంచేలా పోరాడుతామని హామీ ఇచ్చారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెరిగేలా కృషి చేశామని తెలిపారు. గ్రాడ్యుటీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచేలా కృషి చేశామని చెప్పారు. లియాఫీ చైర్మన్ నారాయణరెడ్డి, జోనల్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కడప డివిజన్ సెక్రటరీ జనరల్ కదిరప్ప, అధ్యక్షులు జయభరత్‌రెడ్డి, కోశాధికారి కృష్ణ, ఎల్ఐసి ఎస్‌డిఎం జి. కె. ఆర్.వి రవికుమార్, మార్కెటింగ్ మేనేజర్ టి. శ్యామ్ సుందర్‌రావు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ కార్యదర్శి ఎ. రఘునాథరెడ్డి ప్రసంగించారు.

కడప బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక

లియాఫీ కడప బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఆర్. నిత్యానందరెడ్డి, కార్యదర్శిగా ఎస్. వీరభద్రుడు, ఉపాధ్యక్షులుగా సుబ్బిరెడ్డి, కోశాధికారిగా కె.వి. రమణారెడ్డి, సభ్యులు ఎన్నికయ్యారు. వీరితో ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వారు ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో లియాఫీ కడప బ్రాంచ్ సభ్యులు వి.గంగాధరయ్య, చెన్నూరు చెన్నయ్య, కె.శ్రీనివాసులు, శంకరరెడ్డి, బి. మునయ్య, ఎం.నరసింహ, ఎ.శ్రీనివాసులు, చంద్ర మోహన్‌రెడ్డి, రామలింగారెడ్డి, కడప డివిజన్ ఉపాధ్యక్షులు బి.రాజేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శి ఎస్. ఇస్మాయిల్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : వైసిపి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న అంజాద్‌బాషా

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో నియంత, రాక్షస పాలన కొనసాగుతోందని మాజీ డిప్యూటీ సిఎం, వైసిపి పిఎసి సభ్యులు ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. ఆది వారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసిపి నాయకులను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపే అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైసిపిని ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు విచారణలు, లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్టులు చేస్తున్నారన్నారు. ఆ ప్రక్రియలోనే అంతులేని దారుణ వేధింపులకు కూడా గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ఇంకా ఇలాగే కొనసాగితే ఏ మాత్రం సహించబోయేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ తీరును కచ్చితంగా ప్రజల్లో ఎండగడతామన్నారు. అధికారం, అధికారులు శాశ్వతం కాదని చెప్పారు. మరల అధికారంలోకి వచ్చేది వైసిపి ప్రభుత్వమే అని ఈ సందర్భంగా అన్నారు. మీరు ఒక దుష్ట సాంప్రదాయాన్ని ప్రారంభించారని, రాబోయే ప్రభుత్వాలు కూడా ఈ దుష్ట సంప్రదాయాన్ని కొనసాగించే పరిస్థితి వస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో నడుస్తున్న రెడ్ బుక్ రాజ్యాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాబోయే కాలంలో అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తామని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు, నాయకులకు పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని ఆయన చెప్పారు.

ఎన్నికల కమిషన్ బిజెపికి అనుకూలం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల కమిషన్ బిజెపికి అనుకూలంగా పనిచేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కు ఆదేశించిందని తెలిపారు. ఇప్పుడు ఈ ప్రక్రియను దేశం మొత్తానికి విస్తరించాలని ఇసి. కోరుకుంటోందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలను సవరించడం పేరిట, ఓటర్ల పౌరసత్వాన్ని ధృవీకరించే అధికారాన్ని వినియోగించుకుంటోందని తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి విదేశీయులను తొలగించాలనే నిరాధారమైన సాకుతో, వారు మైనారిటీలలోని విస్తారమైన వర్గాలను, ఇతర ఎంపిక చేసిన సమూహాలను ఓటుహక్కును కోల్పోతున్నారని పేర్కొన్నారు.

బిందుసేద్యంతో అధిక ఆదాయం

-ఎస్‌సి, ఎస్‌టిలకు వంద శాతం సబ్సిడీ
- డ్రిప్ మెటీరియల్ సరఫరాలోనూ పురోగతి
- ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బిందుసేద్యం అధిక దిగుబడులకు నిలయంగా మారింది. ఫలితంగా సూక్ష్మ సేద్యానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఇందులోభాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాం. ఇందులో భాగంగా అర్హులైన రైతుల్లో 80 శాతం మందికిపైగా పరికరాలను సైతం అందించడమైంది. ఏడేళ్ల కిందటి నుంచి జిల్లాలోని 36 మండలాల్లో 65 వేల హెక్టార్లలో బిందుసేద్యం ద్వారా పంటలను సాగు చేశాం. ఇందులో జిల్లాలోని పులివెందుల, మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లోనూ బిందుసేద్యం పెద్దఎత్తున సాగవుతోందని పేర్కొంటున్న ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరెడ్డితో ప్రజాశక్తి ముఖా ముఖి...

బిందుసేద్యం పురోగతి ఎలా ఉంది?

2025-26 ఆర్థిక సంవత్సరంలో 1,250 ఎకరాల్లో బిందు సేద్యం చేయడమే లక్ష్యం. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి 13, 500 ఎకరాలకు బిందుసేద్యం సదుపాయం అందించే అవకాశం ఉంది.

స్ప్రింకర్ల సాగు తీరుతెన్నుల్ని వివరించండి?

జిల్లాలో స్ప్రింక్లర్ల సాగు లక్ష్యం 4,500 ఎకరాలు, ఇందులోభాగంగా 1,720 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 5,401 ఎకరాల్లో సాగుకు అవకాశం ఉంది. ఇందులో 563 దరఖాస్తులకు 1,701 హెక్టార్లలో సాగుకు అవకాశం ఉంది. బిందు, స్ప్రింకర్ల సాగు మొత్తాన్ని పరిశీలిస్తే 37,050 ఎకరాల సాగు లక్ష్యానికిగానూ ఇప్పటికి 20,377 ఎకరాల్లో సాగుకు గల అవకాశాలు ఉన్నాయి. 2026 మార్చి నెలాఖరు నాటికి 31 వేల ఎకరాల్లో సాగు చేయడానికి అవకాశం ఉంది.

దరఖాస్తుల వివరాలు తెలపండి?

జిల్లావ్యాప్తంగా 7,800 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయడమైంది. ఈమేరకు 6,500 మంది రైతులు, 7,800 నుంచి 19,266 ఎకరాల్లో సాగు చేయడానికి అవకాశం ఉంది.

సబ్సిడీ వివరాలను తెలపండి?

బిందుసేద్య పరికరాలకు సబ్సిడీ వరిస్తుంది. ఇందులో ఐదె కరాలు లోపు కలిగిన ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 100 శాతం, 10 ఎకరాలు కలిగిన మిగిలిన అన్ని కేటగిరీల రైతులకు 90 శాతం చొప్పు న సబ్సిడీ వర్తిస్తోంది.

డ్రిప్ ఇరిగేషన్ కేటాయింపు విధానాన్ని తెలపండి?

ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ప్రాంత ఆర్‌బికె అధికారులు మొదటగా ప్రాథమిక సర్వే, బయోక్యూ చేసి అర్హమైన రైతులకు సిరఫాసు చేయడం తప్పనిసరి. వీటిని ఎపి ఎంఐపి పీడీ 10 శాతం, ఎపిడి 10 శాతం, హార్టీకల్చర్ అధికారులు 20 శాతం, ఎంఐఎస్‌హెచ్‌జి 10 శాతం, ఆర్‌బికె ఇన్‌ఛార్జులు 10 శాతం చొప్పున క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారించడం జరుగుతుంది.

బిందుసేద్యం ఆదరణకు గల కారణాలేమిటి?

కరువు పీడిత ప్రాంతాలు కావడం, నాణ్యమైన దిగుబడులకు అవకాశం ఏర్పడడం, కలుపు ఖర్చులు కలిసి రావడం తెలిసిందే. దీనికితోడు నీటి ఆదా, ఎరువుల వినియోగ పరిమాణం, విద్యుత్ బిల్లుల్లో తగ్గుదల వంటి అదనపు సౌలభ్యాలు కలిసి రావడం కారణ మని తెలుస్తోంది.

డ్రిప్ ఇరిగేషన్‌కు ఆదరణ గల ప్రాంతాలేవి?

జిల్లా వ్యాప్తంగా బిందుసేద్యం సాగుకు ఆదరణ లభిస్తోంది. ఇందులో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పులివెందుల, సింహాద్రిపురం, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట తోపాటు పెండ్లిమర్రి, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో పెద్ద ఎత్తున బిందుసేద్యం ద్వారా పంటలు సాగు చేయడం కనిపిస్తోంది.

పుల్లూరులో నిరంతరాయంగా వెలుగుతున్న వీధి దీపం

విద్యుత్ వృథా.. అధికారులకు పట్టదా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామ పంచాయతీలలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. దీపాలు పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. దీపాలు త్వరగా మరమ్మతుకు రావడంతోపాటు గ్రామ పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోంది. ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి. వీధి దీపాల వెలుగుల గురించి అధికారులకు కళ్ళముంగిట కనిపిస్తున్న చర్యలు కరువయ్యాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పుల్లూరు, బీసీ కాలనీ, పూసల కొట్టల్ గ్రామాలలో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి.

కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

కుందూ నదిలో పెరిగిన నీటిమట్టం

ప్రజాశక్తి - చాపాడు

కుందూనదిలో రెండు రోజులుగా నీటిమట్టం పెరిగింది. పది రోజుల క్రితం వరకు కుందూలో నామమాత్రంగానీటి ప్రవాహం ఉండేది. ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షాలకు శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం చేరడంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. మూడు రోజుల క్రితం రాజోలి ఆనకట్ట నుండి కుందూకు అధికారులు నీటిని విడుదల చేశారు. నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం కుందూ నదిలో రాజోలి ఆనకట్ట నుంచి 15వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. కుందూనది తీర గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. కుందూ నది నీటి ఆధారంగా ఇప్పటికే రైతులు పసుపు పంటను సాగు చేపడుతున్నారు. వరి ఇతర పంటలు సాగు చేసే రైతులు ఏర్పాట్లలో ఉన్నారు.

22 నుంచి పశువుల పోషణలో శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శాస్త్రీయ యాజమాన్య పద్ధతిలో పశుపోషణ చేపడితే అధిక పాల దిగుబడి సాధించవచ్చని డాక్టర్ రాజకిషోర్ తెలిపారు. పశు పోషణ విభాగం పశు వైద్య కళాశాల ప్రొద్దుటూరు, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, జాతీయ వ్యవసాయ పరిశోధన యాజమాన్య సంస్థ హైదరాబాద్ సౌజన్యంతో ఎస్సీ రైతులకు సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడి పరిశ్రమ ఆవశ్యకత అంశంపై ప్రొద్దుటూరు పశువైద్యకళాశాలలో ఈనెల 22 నుంచి 26 వరకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిక్షణలో పాడి పశువుల పెంపకం, పోషణలో మెలకువలు, వ్యాధులు, నివారణ, పాల పదార్థాల ద్వారా జీవనోపాధి, ప్రభుత్వ పథకాలు, క్షేత్ర పర్యటన ఇతర అంశాలు ఉంటాయన్నారు.

రోడ్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులకు చెందిన సిమెంట్ రోడ్డును తొలగించిన టిడిపి నాయకుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసిపి మైనార్టీ సెల్ కన్వీనర్ బాబ్జి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వంలో దౌర్జన్యంగా రోడ్డును తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెంటనే టిడిపి నాయకుడినిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీలపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపు ఈ సంఘటనతో అర్థమవుతోందన్నారు.

అందుబాటులో యూరియా : ఎఒ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సచివాలయాల్లో యూరియా అందుబాటులో ఉంచుతున్నామని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. రైతుల నుండి యూరియా కావాలని వినతులు అందుతుండడంతో అన్ని సచివాలయాలకు యూరియాను అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఎకరాకు ఒక బస్తా, ఎకరాకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రెండు బస్తాలు యూరియా పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియాను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. సోమాపురం సచివాలయంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తామని తెలిపారు.

రోజాపై టిడిపి ఎమ్మెల్యే వ్యాఖ్యలు బాధాకరం

ప్రజాశక్తి - చాపాడు

మాజీ మంత్రి రోజాపై నగిరి టిడిపి ఎమ్మెల్యే భాను ప్రకాష్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి ఖండించారు. ఈ వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. మహిళలను రాజకీయంగా అణగదొక్కాలనే కుట్ర ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. మహిళలు రాజకీయంగా రాణించాలంటే ఎన్నో అవరోధాలు, అడ్డంకులు దాటుకుని నిలబడాల్సి వస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్న మహిళా నాయకురాలు రోజాపై వ్యక్తిగత దూషణలు, విమర్శలు ప్రజాస్వామ్యం కాదన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ముద్దనూరు

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. శెట్టివారిపల్లె, ఓబుళాపురం గ్రామాల్లో ఆదివారం భూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వంద శాతం అమలు చేసినట్లు చెప్పారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్ కుమార్ రెడ్డి, కేశవ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న భూపేష్ రెడ్డి

26 నుండి గండిలో శ్రావణ మాసోత్సవాలు

ఐదు శనివారాలూ ప్రత్యేక పూజలు, అన్ని ఏర్పాట్లు పూర్తి : ఆలయ చైర్మన్, ఇఒ

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన చక్రాయపేట మండలంలో పాపాగ్ని నది ఒడ్డున వెలిసిన గండి క్షేత్రం వీరాంజనేయ స్వామి శ్రావణమాస మాసోత్సవాలు ఈనెల 26నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈనెల 26 మొదటి శ్రావణ శనివారం నిర్వహిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వాములు తెలిపారు. ఈనెల 26న, ఆగస్టు 2న, 9న, 16న, 23న వచ్చు శనివారాల్లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

ఎత్తైన కొండల నడుమ పాపాగ్ని..

ఆలయ సమీపంలోనే సుమారు 2 వేల అడుగుల ఎత్తైన కొండల నడుమ పాపాగ్ని నది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ సుందర దృశ్యం పలువురిని ఆకట్టుకుంటుంది. గండి క్షేత్రం తీర్థాలలో పాపాగ్ని తీర్థం అతి పవిత్రంగా భావిస్తారు. దత్త మండలాలు ఉన్నప్పుడు కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో విదేశీ యువకుడైనా భారత సంస్కృతి గురించి అవగాహన లేకపోయినా పవిత్ర హృయుడుగా ఉండేవారు. అందుకే అతనికి గండి క్షేత్రంలో స్వర్ణ విజయతోరణం దర్శనం ఇచ్చిందని కలెక్టర్ గెజిటెడ్‌లో రాసినట్లు పలువురు పేర్కొంటున్నారు. పాపాగ్ని నది కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నందిగానులో పుట్టి సుదీర్ఘంగా అనంతపురం జిల్లాలో వ్యాపించి చిత్తూరు జిల్లా నుంచి కడప జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టు నుండి గండి క్షేత్రం ఆంజనేయ స్వామి పాదాల వద్ద ప్రవహిస్తూ సంఘమేశ్వరం వద్ద పెన్నా నదిలో అంతర్భాగమవుతుందని చరిత్ర చెబుతోంది.

గండి అంజన్న క్షేత్రానికి చేరుకోవాలంటే..

గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకోవాలంటే తిరుపతి నుంచి పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మీదుగా గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. కర్నూలు నుంచి కడప మీదుగా వేంపల్లి నుండి గండి క్షేత్రానికి చేరుకోవచ్చు, అనంతపురం నుంచి పులివెందుల మీదుగా వేంపల్లి నుంచి చేరుకోవచ్చు. జమ్మలమడుగు నుంచి వచ్చే వారు ప్రొద్దుటూరు మీదుగా ఎర్రగుంట్ల, వేంపల్లి క్షేత్రానికి చేరుకోవచ్చు. ప్రతి ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి కూడా తండోపతండాలుగా శ్రావణమాసోత్సవాలు అత్యధిక సంఖ్యలో యాత్రికులు ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి వస్తున్నారు.

గండి ఆలయ ముఖచిత్రం (ఇన్‌సెట్) ఆంజనేయ స్వామి మూల విరాట్

స్వామివారి పూల అలంకరణ తమిళనాడు రాష్ట్రం అంబురీరు నుంచి చేయిస్తారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేస్తారు. యాత్రికులకు వసతి సౌకర్యం క్యూలైన్లు, తాగునీరు, నిరంతరంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. స్నానం చేయడానికి నదిలో బోర్లు వేయించి సెల్లర్లు ఏర్పాటు చేస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున షెడ్లు వేసి అందరినీ అలరించేలా ఏర్పాటు చేస్తారు. మొబైల్ టాయిలెట్స్, చలువ పందిళ్లు, పోలీస్ అవుట్ పోస్టు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలు కల్పిస్తారు. యాత్రికుల కాలక్షేపానికి పౌరాణిక నాటకాలు, కోలాటాలు, భజనలు నిర్వహిస్తారు. వేంపల్లి వైపు నుంచి వచ్చే యాత్రికులకు వీరన్నగట్టు పల్లె నుండి, రాయచోటి వైపు నుంచే వచ్చే వారికి అద్దాలమర్రి క్రాస్ నుంచి గండి క్షేత్రానికి ఉచిత బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..

గండి క్షేత్రానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని వారు కోరారు.

ఎర్రచెరువులో సమృద్ధిగా నీరు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఎర్రచెరువుకు నీరు సమృద్ధిగా వచ్చి చేరుతోంది. తెలుగుగంగ రిజర్వాయర్ నుండి ఎర్రచెరువుకు నీరు వచ్చి చేరుతోంది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు పట్టణానికి తాగునీటి అవసరాల కోసం చెరువుకు నీటిని విడుదల చేయించిన విషయం తెలిసిందే. గత వేసవిలో చెరువులో నీరు ఉండడంతో తాగునీటి సమస్య తలెత్తలేదు. ప్రస్తుతం చెరువులో నీరు ఉండడంతో తాగునీటితోపాటు పంటలు సాగు చేసుకునే రైతులకు కూడా అవకాశం ఏర్పడుతుంది. మైదుకూరు నియోజకవర్గం పరిధిలోని కుందూ నదికి ఇప్పటికే అధికారులు నీటిని విడుదల చేశారు. త్వరలో కేసి కాలువకు కూడా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది స్థానికంగా వర్షాలు పడనప్పటికీ ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షానికి శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే.

రైతుల అవసరాల మేరకు నీరు విడుదల

పైడిపాలెం రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

రైతుల అవసరాల మేరకు పైడిపాలెం రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్నట్లు గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఇఇ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పైడిపాలెం రిజర్వాయర్ పూర్తిస్థామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.4 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ప్రస్తుత సీజన్‌లో తీవ్ర వర్షాభావ కారణంగా పండ్ల తోటలు, ఇతర పంటల సాగుచేసిన రైతుల అవసరాల దృష్ట్యా సంతకోవూరు కెనాల్, హిమకుంట్ల కెనాల్‌కు 140 క్యూసెక్కులు, హై లెవెల్ కెనాల్‌కు 40 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు.

కనిపించని సమాచార హక్కు చట్టం బోర్డు

ప్రజాశక్తి - వేముల

వేముల విద్యుత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డు కనిపించడంలేదు. కార్యాలయానికి సంబంధిత విద్యుత్ అధికారులు పదేపదే వస్తున్నప్పటికీ ఏ అధికారి కానీ సమాచార హక్కు చట్టం బోర్డు లేదన్న విషయాన్ని గుర్తించలేదు. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. సమాచార హక్కు చట్టం-2005లో అమలు ప్రభుత్వ కార్యాలయాల్లో చేసినప్పటికీ సుమారు 20 ఏళ్ల అవుతున్నా వేముల విద్యుత్ కార్యాలయంలో కనిపించలేదు. సమాచారం హక్కు చట్టం బోర్డు ప్రతి పౌరుడికి పారదర్శకత, జవాబుదారీతనంగా ఉంటుంది. అధికారుల వివరాలు అందరికీ తెలిసేలా ప్రభుత్వానికి చెందిన ప్రతి కార్యాలయంలో ఈ బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం ప్రతి పౌరుడు ఈ చట్టం ఉపయోగించుకుని ప్రభుత్వం నుంచి సమాచారం పొందవచ్చు. అందుకే ఈ చట్ట ప్రకారం సమాచారం అందించే బాధ్యులైన సిబ్బంది వివరాలు ఇలా బోర్డులపై ప్రతి కార్యాలయంలోనూ ప్రదర్శించాలనేది ప్రాథమిక నిబంధన అయినప్పటికీ.. సంవత్సరాల గడుస్తున్నా వేముల విద్యుత్ కార్యాలయంలో కనిపించడంలేదు. బోర్డులో ప్రదర్శించ వలసిన సహాయ, సమాచార అధికారి ఫోన్ నంబర్లు లేకపోవడం శోచనీయం. గతంలో ఎంతోమంది తమకు అవసరమైన సమాచారం కోసం దరఖాస్తు చేసినా ఏమాత్రం స్పందించకపోవడం ఈ కార్యాలయం ప్రత్యేకత. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని సమాచార బోర్డు స్పష్టంగా అన్ని సక్రమ వివరాలతో ఏర్పాటు చేయాలని, దరఖాస్తు చేసిన వారికి తప్పక సమాచారం అందించాలని పలువురు కోరుతున్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డులేని వేముల విద్యుత్ కార్యాలయం

వచ్చే విద్యా సంవత్సరంలో కొత్త భవనాల్లోకి..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో అసంపూర్తిగా నిలిచిన పోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను పూర్తి చేయించి, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు కొత్త భవనాల్లో విద్యా బోధన చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ రాం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో అసంపూర్తిగా నిలిచి పోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లెలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్క భవనాలు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. చింతలమడుగు పల్లె సమీపంలోని కొండపై డిగ్రీ కళాశాలను నిర్మాణం చేపట్టాలని తీర్మానం చేసి టెండర్లు పిలిచి పనులను ప్రారంభించిందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం రివర్స్ పరిపాలన కావడంతో ముందు రహదారి నిర్మించకుండా భవనాల పనులను చేపట్టిందన్నారు. రహదారి విషయాన్ని లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రి లోకేష్ సూచన మేరకు డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు జివి రమణ, డివి సుబ్బారెడ్డి, రమేష్, జయచంద్రారెడ్డి, పోతిరెడ్డి శివ, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, భానుకిరణ్, ఇంజినీరింగ్ అధికారులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మురుగునీరు నిలువ లేకుండా చర్యలు

కాలువలోకి నీరు వెళ్లేలా పనులు చేసిన కాలనీవాసులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో ఐదవ వార్డులో మురుగునీరు నిలువ లేకుండా కాలనీవాసులు చర్యలు చేపట్టారు. వీధి బాగుంటే అందరం బాగుంటాం.. మన ఇల్లు బాగుంటుంది.. మనం బాగుంటాం అనే లక్ష్యంతో కాలనీ వాసులు కలిసి స్వచ్ఛందంగా పనులు చేశారు. దాదాపు 20 ఏళ్ల క్రితం సింహాద్రిపురం 5వ వార్డులో సిమెంట్ రోడ్ వేశారు. రోడ్డుకిరువైపులా మురుగు కాలువలు తీశారు. కాలువలను ఆ సమయంలో ప్రధాన రోడ్డుకు కలుపుతూ డ్రెయినేజీ లేకపోవడంతో కాలువలు మట్టితో పూడ్చి, వాటిపై మెటుకలు కట్టుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో వెడల్పు తగ్గడం, మురుగు నీరు రోడ్డుపై ఇబ్బందికరంగా ఉండడంతో కాలనీవాసులు పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రయోజనం లేకపోవడంతో పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఆయన సూచనతో వేంపల్లి మండల టిడిపి ఇన్‌ఛార్జి అజ్జుగుట్టు రఘునాథ రెడ్డి, టిడిపి నాయకుడు శ్రీధర్‌రెడ్డి, మరి కొంతమంది ముందుకొచ్చి వారి ఆధ్వర్యంలో కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. కాలనీలోని ప్రజలు 3రోజులు శ్రమించి ఎట్టకేలకు ఆదివారం ప్రధాన రోడ్డు డ్రైనేజీ కాలువకు కలిపి వీధి ప్రజలు డ్రెయినేజీ వల్ల పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించారు. మురు గునీరు నిల్వ లేకుండా కాలువలో వెళ్లే చర్యలు చేపట్టడంతో కాలనీ శుభ్రంగా తయారైంది. కాలనీవాసులు చేపట్టిన పనుల పట్ల పలువురు వర్షం వ్యక్తం చేశారు.

పనులు చేస్తున్న కాలనీవాసులు

కెసి ఉపకాలువలో చేపట్టిన పూడికతీత పనులు

కెసి ఉప కాలువలో పూడికతీత

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో ఉన్న కెసి ఉపకాలువలో పూడికతీత పను లను చేపట్టారు. మైదుకూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కందనూరు నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ఖాదర్‌పల్లె గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే 1వ నెంబర్ చాపాడు కాలువ పూర్తిగా పూడికతో నిండిపోయి అధ్వానంగా ఉండేది. పం ట కాలువలో నీరు ప్రవహించడం కష్టతరంగా ఉండేది. ఈ విష యాన్ని కెసి కెనాల్ అధికారులకు రైతులు విన్నవించడంతో చాపాడు చానల్ ఎఇ గురు మోహన్‌రెడ్డి స్పందించి పూడికతీత పనులు చేయించారు. చాపాడు ఛానల్ చివరి ఆయికట్టుకు నీరు చేరడం సులభతరమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సిపిఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మైదుకూరు పట్టణం రాయలసీమ నడిబొడ్డున ప్రధాన కుడలి కేంద్రమన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ కేంద్రం కావడంతో చుట్టూ 5 మండలాల పరిధిలో ఉన్న గ్రామాల నుండి ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం మైదుకూరుకు వస్తారన్నారు. కూరగాయల మార్కెట్, సంత ఇలా అన్ని ఇక్కడే ఉండడంతో నిత్యం వేల సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు వస్తుంటారని, వీరికి అందుబాటులో ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేదన్నారు. ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కడప రోడ్డు పోస్ట్ ఆఫీస్ వద్ద మరుగుదొడ్లు ఉండేవని, కొన్ని కారణాలతో గతంలో తొలగించారన్నారు. కేవలం ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మహిళలు, రోగులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని మైదుకూరు పట్టణంలో రెండు ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గురయ్య, శేఖర్, నాయకులు జహంగీర్ బాషా పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేస్తాం

హెచ్ఆర్‌పిసిఐ రాయలసీమ రీజినల్ వైస్ చైర్మన్ కె.రామమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం రూరల్

మహిళా సాధికారతకు కృషి చేస్తామని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాయలసీమ రీజినల్ వైస్ చైర్మన్ కె.రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లా డుతూ తాను కొండాపురం మండలం పి. అనంతపురం గ్రామానికి చెందినవాడను అని పేర్కొన్నారు. తనను సంస్థ నేషనల్ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ రాయలసీమ రీజినల్ వైస్ చైర్మన్‌గా నియమించారని, అందుకు ముందుగా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొ న్నారు. సమాజంలో మహిళ పట్ల జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, బడుగు బలహీన వర్గాల దాడులపై తమ సంస్థ తరపున న్యాయ పోరాటం చేస్తామన్నారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామని, మానవ హక్కులకు భంగం కలగకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన హెచ్ఆర్‌పిసిఐ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ కొత్త మాస్ భాస్కర్‌బాబుకు, జిల్లా చైర్మన్ డేవిడ్ రాజ్‌కు ధన్యవాదాలు అన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ట్రాన్స్‌కో అధికారులు

బ్రహ్మంగారిమఠం : శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామిని ఆదివారం జిల్లా టెక్నికల్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా సిఇ కృష్ణ కుమార్, ఎస్ఇ ప్రాజెక్ట్స్ శ్రీరామచంద్ర మూర్తి దర్శించుకున్నారు. వీరికి మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఇఇ, డిఇఇ, ఎడి కులాయప్ప, ఎఇలు, స్థానిక లైన్‌మెన్ రమేష్, సుధాకర్ ఉన్నారు.

రెడ్యంకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - ఖాజీపేట

రెడ్యంను సన్మానిస్తున్న గ్రామస్తులు

వైసిపి పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శిగా రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని నియమించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. ఆదివారం దుంపలగట్టు గ్రామంలోని రెడ్యం నివాసంలో ఆయన సోదరుడు కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్ రెడ్డిని పలువురు నాయకులు శాలువా వేసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. వైసిపి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి బత్తిన సుబ్బరాయుడు యాదవ్, ఆర్ట్స్ కళాశాల మాజీ చైర్మన్ మద్దిక నాగేశ్వరరెడ్డి, వైసిపి మండల యూత్ అధ్యక్షులు రమణ, చిట్టిబోయిన గోపాలకృష్ణ యాదవ్, బత్తిన నాగమల్లేష్ యాదవ్, గంగిరెడ్డి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే కేన్సర్ నయం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

సకాలంలో లక్షణాలను గుర్తిస్తే తగిన వందల ద్వారా కేన్సర్‌ను నయం చేసుకోవచ్చని రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు కృష్ణదేవరాయలు, కేన్సర్ వైద్యులు వైద్యుడు వంశీ విహారి ఎర్కొన్నారు. ఆదివారం స్థానిక డైట్ కళాశాల ఆవరణంలో రోటరీ క్లబ్, కడప మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్య బృందం 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేన్సర్ ఏ దశలో ఉన్నా నయం చేయవచ్చుని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీతో మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా నయం చేయవచ్చని పేర్కొన్నారు. కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు తెలిసిన వెంటనే ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, వెంటనే సంబంధిత డాక్టర్ దగ్గరికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. అనంతరం వైద్యులను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో రాయచోటి రోటరీ క్లబ్ అధ్యక్షుడు వైవిఎస్ ప్రకాష్, మాజీ అధ్యక్షులు మనోజ్ కుమార్, జోషి ,సురేష్ కుమార్, కె వి ఎస్ నాయుడు, రెడ్డి శంకర్, మహమ్మద్ హుస్సేన్, రెడ్డన్న, అష్రఫ్ అలీ, రియాజుద్దీన్‌తో పాటు సభ్యులు చెన్నకేశ వులు షౌకత్ అలీ పాల్గొన్నారు.